అంధకారంలో బస్తీలు

అధికారుల నిర్లక్ష్యంతో బస్తీలు, కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్ అన్నారు. వీధిదీపాలు వెలుగక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులు చేయాలని అధికారులకు పలుమార్లు వివరించినా స్పందించడం లేదని వాపోయారు. అధికారులు వెంటనే మరమ్మత్తులు చేయించాలని ముఖేశ్ కోరారు.

- మైలార్‌దేవ్‌పల్లి

కలుషిత తాగునీటి సరఫరా

బంజారాహిల్స్ రోడ్ నం.12 లోని ఎన్‌బీటీ నగర్ బస్తీలో కలుషిత తాగునీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలోని కొన్నివీధుల్లో నల్లా నీటిలో డ్రైనేజీ కలువడంతో స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. 8 నెలల క్రితం కొత్త పైపులైన్ వేసినా.. జలమండలి సిబ్బంది కొన్ని వీధుల్లోనే కనెక్షన్లు ఇచ్చారు. నల్లాలు వచ్చే సమయంలో అరగంట పాటు కలుషిత నీరు వస్తోందని, నల్లని, దుర్వాసన వస్తున్న నీటిని రోడ్లపైకి వృధాగా వదిలిపెట్టాల్సి వస్తోందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలమండలి అధికారులు స్పందించి కొత్తలైన్‌కు కనెక్షన్లు ఇప్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

- బంజారాహిల్స్

సమగ్ర కుటుంబ సర్వేకు సిబ్బంది సిద్ధం

యూసుఫ్‌గూడలో 690 ఎన్యుమరేషన్ బ్లాక్‌లు

ఈనెల 6 నుంచి 20 వరకు ఇంటింటి సర్వే

సర్వే సిబ్బందికి తుది విడత శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్, పాల్గొన్న డీసీ, ఇతర అధికారులు (ఫైల్)

సర్వేలో పాల్గొన్న టీచర్లు, సర్వే సిబ్బంది (ఫైల్)

జూబ్లీహిల్స్, నవంబర్ 3 : జీహెచ్ఎంసీ అధికారులు ఈ నెల 6 నుంచి ఇంటింటినీ సందర్శించి సమగ్ర కుటుంబ సర్వే చేపట్టనున్నారు. ఈ మేరకు యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 690 ఎన్యుమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటుచేశారు. ఒక్కో బ్లాక్‌లో ఒక ఎన్యుమరేటర్ 150 ఇండ్లను సందర్శించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణనకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. సంబంధిత ప్రొఫార్మా పూర్తిచేసిన తర్వాత సదరు ఇంటిపై సర్వే స్టిక్కర్‌ను వేస్తారు. దీంతో ఆ ఇంటికి సంబంధించిన సర్వే పూర్తయినట్లు గుర్తింపు లభిస్తుంది. యూసుఫ్‌గూడ సర్కిల్లో 5 వార్డులకు యూసీడీ డీపీఓ వెంకటకిషన్‌రావు నేతృత్వంలో ఆయా వార్డు అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. జనాభా ప్రాతిపదికన 10 ఎన్యుమరేటర్ బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించినట్లు వెల్లడించారు. యూసుఫ్‌గూడ, వెంగళరావు నగర్, రహ్మత్ నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో ఈనెల 6 నుంచి 20 వరకు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సర్వే చేపట్టనున్నారు. సిబ్బందికి శనివారం తుది విడత శిక్షణ పూర్తి చేయగా జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో పాటు ఆశవర్కర్లు, అంగన్‌వాడీ.. ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు సర్వేలో పాల్గొననున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో సర్వే సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ పూర్తి చేసినట్లు.. నిర్దేశిత పక్షం రోజుల్లో సర్వే పకడ్బందీగా పూర్తిచేయనున్నట్లు 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు.

బస్తీ అభివృద్ధికి సహకరించండి

శ్రీనగర్ కాలనీ డివిజన్ ఎల్లారెడ్డి గూడ హరిజన బస్తీలో నూతనంగా ఎన్నికయిన బస్తీ కమిటీ నాయకులు ఆదివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బస్తీలో అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొమ్ము బిక్షపతితో పాటు నల్లపోచమ్మ ఆలయం చైర్మన్ చిన్నబాబు, కార్యవర్గ సభ్యులు సాగర్, గాంధీ, గోవర్ధన్, కపిల్, చంద్రశేఖర్. జహీర్, ఖలీం, అవినాశ్ పాల్గొన్నారు.

- బంజారాహిల్స్

దీపావళి శుభాకాంక్షలు

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్‌ను ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ డివిజన్ నాయకులు కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌దాస్, నాయకులు బస్వరాజు, వేణుగోపాల్, నాగరాజు పాల్గొన్నారు.

- జూబ్లీహిల్స్

మానసిక ఆరోగ్యం కోసం ధ్యానం చేయాలి

శంషాబాద్ రూరల్, నవంబర్ 3 : మానసిక ఆరోగ్యం కోసం ధ్యానం చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ సూచించారు. ఆదివారం హుడా కాలనీలోని బ్రహ్మకుమారీస్ రాజయోగం మెడిటేషన్ సెంటర్ మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్‌యాదవ్, కౌన్సిలర్లు మేకల వెంకటేశ్, భారతమ్మ పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ వార్షికోత్సవంలో నృత్యప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, తదితరులు

సీవరేజీ సమస్యలు లేకుండా చూడండి

పూడికతీత పనులు పరిశీలిస్తున్న జలమండలి డీఓపీ -1 సుదర్శన్, జీఎం హరిశంకర్

జూబ్లీహిల్స్, నవంబర్ 3 : సీవరేజీ సమస్యలు లేకుండా చూడాలని జలమండలి డైరెక్టర్ ఆపరేషన్స్-1 సుదర్శన్ అధికారులను ఆదేశించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన జలమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న 90 రోజుల డీసిల్టింగ్ ఆపరేషన్స్‌ను యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఓవర్ ఫ్లో అవుతున్న కాలువల విస్తృతి పెంచాలని అధికారులకు సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో జీఎం హరిశంకర్‌తో కలిసి పర్యటించి పూడికతీత పనులను పరిశీలించారు.

ఆనంద్‌సాయికి సన్మానం

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా నియమితులైన సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయిని మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి ఆదివారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, గంగాధర్, కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు. - మణికొండ

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

జూబ్లీహిల్స్, నవంబర్ 3: కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 19 వ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సహభావన టౌన్‌షిప్(నాగోల్) విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇండివిజువల్ కటా విభాగంలో ఈశ్విక్ బంగారు పతకం, జాన్‌అలివర్ కాంస్య పతకం, ఫైట్ విభాగంలో దైవిక్, ఈశ్విక్ బంగారు పతకం, కార్తీక్ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సహభావన టౌన్‌షిప్ అధ్యక్షుడు శ్రీనివాస్, కరాటే మాస్టర్ కుమారస్వామి అభినందించారు.

జూబ్లీహిల్స్ : నగరంలోని లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్‌లో శనివారంతో ముగిసిన ఉస్మానియా ఇంటర్ యూనివర్శిటీ కరాటే కాంపిటీషన్స్ కమ్ సెలక్షన్స్‌లో యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియం క్రీడాకారుడు ఎ.పురుషోత్తం బంగారు పతకంతో సత్తా చాటాడు. 55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి మధ్యప్రదేశ్‌లో జరుగనున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కేవీబీఆర్ కరాటే కోచ్ ఉత్తమ్ తెలిపారు.

ముగిసిన సదర్ ఉత్సవాలు



నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో జరిగిన ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకుడు బాబుయాదవ్

హిమాయత్‌నగర్, నవంబర్ 3 : దీపావళి పర్వదినం సందర్భంగా యాదవులు ఆనందోత్సవాల మధ్య జరుపుకునే సదర్ ఉత్సవాలు నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో కన్నుల పండువగా జరిగాయి. శనివారం రాత్రి ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఆదివారం ఉదయం వరకు కొనసాగాయి. పాడి పశువులతో పాల వ్యాపారం చేసుకునే యాదవులు వారి దున్న పోతులతో ఊరేగింపు నిర్వహించి ఈ వేడుకలను జరుపుకున్నారు. ఉత్సవాలను వీక్షించేందుకు నగరం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో నారాయణగూడ, హిమాయత్ నగర్, వైఎంసీఏ, బర్కత్‌పుర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి సదర్ ప్రశాంతంగా ముగిసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, నారాయణగూడ పీఎస్ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, డీఐ నాగార్జున, ఎస్సైలు షఫీ, వెంకటేశ్, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జె.బాబుయాదవ్, కృష్ణ యాదవ్, కమల్, రాఘవేందర్ పాల్గొన్నారు.

అభినందనలు

నారాయణగూడలోని మెల్కోటే పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూషణ్ రావు జన్మదినం సందర్భంగా ఆదివారం పార్క్ ఆవరణంలో వాకర్స్ ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హిమాయత్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.రాజేందర్ కుమార్, వాకర్స్ ఆనంద్‌కుమార్‌గౌడ్, రవీందర్,వాసు, రమేశ్ యాదవ్, భరద్వాజ్, రమేశ్‌రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, జోగారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, రాంరెడ్డి, నరేందర్‌రావు పాల్గొన్నారు.

- హిమాయత్ నగర్

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్ : విద్యుత్ కేబుళ్ల మార్పిడి, చెట్లకొమ్మల కత్తిరింపు, మెయింటెనెన్స్ పనుల కారణంగా మంగళవారం బంజారాహిల్స్ సబ్ డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ ఏడీఈ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కుమ్మరి బస్తీ, వినాయక్‌నగర్, విఠల్‌రావునగర్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల దాకా ఇమేజ్ గార్డెన్, సిలికాన్ వ్యాలీ, సైబర్ హిల్స్ కాలనీ, లూట్ మొబైల్ లేన్ ప్రాంతాల్లో, జూబ్లీహిల్స్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫిలింనగర్ ఫీడర్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నం. 45, 52, 53 ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల దాకా జూబ్లీహిల్స్ రోడ్ నం. 36, 62, 63, 64, 58, 65 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ గోపి పేర్కొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

సుల్తాన్‌బజార్ : లోక కల్యాణార్థం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించామని ఇసామియా బజార్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమిరిశెట్టి అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కోఠి ఇసామియా బజార్‌లోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని 117 జంటలతో నిర్వహించారు. 108 జంటలతో వ్రతం నిర్వహించాలని సంకల్పించినప్పటికీ 117 జంటలు వ్రతంలో పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇసామియా బజార్ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రవి కుమార్, కోశాధికారి యర్రం లక్ష్మణ్, ఐపీపీ మ్యాడం అశోక్ గుప్తా, ప్రాజెక్ట్ కన్వీనర్ హర్‌నార్‌తిని శ్రీనివాస్, ప్రాజెక్ట్ చైర్మన్ బెజుగం శ్రీధర్, ప్రాజెక్ట్ కో కన్వీనర్‌లు గుంజు విక్రమ్ పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి

మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

హిమాయత్‌నగర్, నవంబర్ 3 : రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విభాగంలోని ఎన్‌హెచ్ఎం స్కీం కింద పనిచేసే రెండవ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రెండవ ఏఎన్ఎం సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తోట రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్యామల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

17న శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో ప్రథమ మహాసభ

ఈ నెల 17న రంగారెడ్డి జిల్లా, శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో జరిగే సంఘం ప్రథమ మహాసభలకు రెండవ ఏఎన్ఎంలు అధిక సంఖ్యల్లో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో వారు ఆవిష్కరించారు. 17 ఏండ్లుగా పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కొత్త పథకాల రూపంలో వీరిపై ప్రభుత్వం పని ఒత్తిడి పెంచుతుందని ఆరోపించారు. మహాసభలో పలు అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పానుగంటి పర్వతాలు, రామస్వామి, శ్యామల శేఖర్‌రెడ్డి, బి.నరసింహ, ఎం.లక్ష్మీబాయి, హసీనాబేగం, పి.సురేశ్, జక్కుల పద్మ, అరుణ, సువర్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో వైష్ణవి నాట్య సెంటర్ గురువులు డాక్టర్ వైష్ణవి సాయినాథ్ ఆధ్వర్యంలో వారి శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్య నృత్యాలు ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. నృత్యకారులు లలిత ఆనంద్, మీరా, మానస, కాత్య, దేవమని, లాస్య, తపస్య, వకుళ శ్రీఓం, అలీన, అయిజాలు పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, శివతాండవం, కళింగనర్తన, రామ స్తుతి, శివ శక్తి స్తుతి, కృష్ణ స్తుతి, జావళి అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో నర్తించిన తీరు ఆద్యాంతం అలరించింది. - కొండాపూర్, నవంబర్ 3

నేడు జోన్ ఆఫీస్‌లో.. ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్సీ అపూర్వ్ చౌహాన్ తెలిపారు. నేడు జోన్ కార్యాలయంతో పాటు ఐదు సర్కిళ్ల కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని, ఆయా సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో ప్రజా సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలని కోరారు. అధికారుల దృష్టికి సమస్యలను తీసుకొస్తే... ఆ సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వీపర్ సాయిమల్లు కుటుంబానికి న్యాయం చేయండి

కాచిగూడ, నవంబర్ 3 : గత నెల 23వ తేదీ ఉదయం 5 గంటలకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హర్రాస్‌పెంటకు చెందిన స్వీపర్ సాయిమల్లు(70) కుటుంబానికి న్యాయం జరిగేలా చేయాలని హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు కాచిగూడ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. విధులు నిర్వహించడానికి ఇంటి నుంచి స్మశాన వాటికకు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని, ఘటన జరిగి 12 రోజులైనా కారుకుడైన ద్విచక్రవాహనదారున్ని పట్టుకొకపోవడం విడ్డూరమని అన్నారు. మృతి చెందిన సాయిమల్లు కుటుంబానికి త్వరితగతిన న్యాయం చేసి, ఆదుకోవాలని కాచిగూడ పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాన్ని కేసీఆర్ దేశంలోనే అగ్రగామిగా నిలిపారు

బీఆర్ఎస్ కార్యకర్త బబ్లూసింగ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ,నవంబర్ 3: మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి, దేశంలోనే అగ్రగామిగా నిలిపారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం కాచిగూడలో డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, అందుకు పేద ప్రజల కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌ను ఛీ కొడుతున్నారని అన్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలను చేపట్టిన బీఆర్ఎస్ పార్టీని రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలిపించడానికి సంసిద్ధులై ఉన్నారని, అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పథకాలను సద్వినియోగపరుచుకున్న లబ్ధిదారులందరూ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బబ్లూసింగ్, అంటోని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

అబిడ్స్ : గుడిమల్కాపూర్ మహేశ్‌నగర్ కాలనీలో అలువేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పురోహితులు భాస్కరభట్ల రాహుల్ శర్మ పర్యవేక్షణలో .. మహేశ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కాలనీ ప్రతినిధులు పట్నం సుబ్బారావు, ముళ్లె రాకేశ్, న్యాయవాది రాజశేఖర్, గొరిగె శ్రీనివాస్, నరసింహ గౌడ్, కిశోర్‌గుప్తా, ఠాకూర్ ఉదయ్‌సింగ్, ప్రమోద్, గార్లపల్లి ప్రదీప్ కుమార్, గోపాల్ రెడ్డి, రాంరెడ్డి, దేవేందర్ చారి, ప్రేమ్‌కుమార్ గుప్తా, రఘు, సాయి, ప్రశాంత్, నరేందర్ ఠాకూర్, రవీందర్ సాగర్, లక్ష్మణ్ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్, కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్‌సింగ్, మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాశ్, రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూముకుంట అరుణ్‌కుమార్, బీజేపీ నాయకులు దేవర వంశీ, ప్రముఖ న్యాయవాది సాగర్, బీఆర్ఎస్ నాయకులు అంబటి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు మాడిశెట్టి సదానందం గుప్తా, వేణు పాల్గొన్నారు. అన్న ప్రసాద వితరణ అనంతరం పురవీధుల్లో పల్లకి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అమర్‌నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశ్, రేగొండ రాములు పాల్గొన్నారు.